సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 10 । జూన్ । 2025



భూసార పరీక్షలతో..

రైతులు భూసార పరీక్షలు తప్పనిసరి చేయించుకోవాలని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో▸



అదుపుతప్పి డీసీఎం బోల్తా

అధిక లోడ్‌తో వెళ్తున్న డీసీఎం అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన కేశంపేట మండలం వేములనర్వ శివారులో జరిగింది. 8లో▸



గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు బాబయ్య సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు

కేశంపేట: పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సంఘం నాయకులతో కలిసి సోమవారం పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు రెండు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయతీల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 500 మందికి ఒక్క కార్మికుడిని తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం ఉన్న జనాభాకు అనుగుణంగా కార్మికులను తీసుకోవాలని అన్నారు. ఇందుకు స్పందించిన డిప్యూటీ కమిషనర్ వారం రోజుల్లోగా వేతనాల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాజం,కోశాధికారి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. లింగారెడ్డిగూడలో సోమవారం నిర్వహించిన బడిబాటలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పేదలకు విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కంప్యూటర్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, ఆత్మరక్షణ కోసం కరాటే తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే సమక్షంలో ఏడుగురు చిన్నారులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈఓ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు షాద్‌నగర్‌కు మీనాక్షి నటరాజన్ రాక

షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మంగళవారం షాద్‌నగర్ రానున్నారు. పట్టణంలోని ఈడెన్ ఫంక్షన్ హాల్‌లో జైభీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి మీనాక్షి నటరాజన్‌తోపాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విచ్చేస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని పార్టీ మీడియా ఇన్‌చార్జి అశోక్‌కుమార్ కోరారు.

బ్యాంకు కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఆంజనేయులు

షాద్‌నగర్: బ్యాంకులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు జడ్జి ఆంజనేయులు సూచించారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో సోమవారం బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజీమార్గమే రాజమార్గం అన్నారు. కక్షిదారులు పంతాలు పట్టింపులకు పోకుండా, కోర్టుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోకుండా కేసుల పరి ష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. జాతీయ లోక్ అధాలత్ సందర్భంగా ఈనెల 14వ తేదీ వరకు ప్రత్యేక కోర్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్ రావు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మట్టి.. కొల్లగొట్టి!

రెచ్చిపోతున్న మాఫియా

- రాయల్టీ ఎగ్గొట్టి.. సర్కారు ఆదాయానికి గండి
- ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ఆనవాళ్లు కోల్పోతున్న చెరువులు, కుంటలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



ఈ సిటీ భూముల్లో చేపట్టిన తవ్వకాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అడ్డగోలు తవ్వకాలతో చెరువులు, కుంటలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో పక్కనే ఉన్న పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపైనే అక్రమ పోలీసు కేసులు నమోదు చేయిస్తున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. సమీపంలోని ఇటుక బట్టీలకు వందల కొద్ది లారీల మట్టిని తరలిస్తున్నా రు. ఒక్కో లోడు రూ.16 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి పెద్ద ఎత్తున రాయల్టీ ఎగ్గొడుతున్నారు. కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతుంటే, మరికొంత మంది గోరంత అనుమతులు తీసుకుని కొండంత తవ్వకాలు చేపడుతున్నారు. కందుకూరు మండలం ఆకులమైలారం సహా శంషాబాద్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం మండలాల్లో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారులు పరోక్షంగా వారికి సహకరిస్తూ ఆర్థికంగా లబ్ధిపొందుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు.

ఆకులమైలారంలో అడ్డగోలుగా..

కందుకూరు మండలం ఆకులమైలారం మైలమ్మ చెరువు నిండా ఇటాచీలు, జేసీబీలే దర్శనమిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ సీనియర్ ప్రజాప్రతినిధి స్థానికంగా ఉన్న ఓ కుల సంఘం పేరుతో పదివేల మెట్రిక్ టన్నులకు అనుమతి పొంది .. ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నుల మట్టిని కొల్లగొట్టినట్లు సమాచారం. పరిమితికి మించిన తవ్వకాలు, లారీల రాకపోకలతో తమ పంట భూములు పాడవుతున్నాయని పేర్కొంటూ లారీలను అడ్డుకున్న రైతులపై అక్రమ కేసులు నమోదు చేయించారు. కటికపల్లి పంచాయతీ పరిధిలో 37 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ముందలికుంటలో రాత్రి పగలు తేడా లేకుండా త్వకాలు చేపడుతున్నారు. తిమ్మాయిపల్లి సర్వే నంబర్9లోని అసైన్డ్ భూమిలోనూ అక్రమార్కులు తిష్టవేశారు. రోజుకు సగటున 50 నుంచి 100 లారీల చొప్పున మట్టిని మహేశ్వరం, మంకాల్ కేంద్రంగా వెలసిన ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు.

శంషాబాద్ అసైన్డ్ భూముల్లో..

శంషాబాద్ మండల పరిధిలోని అమ్మపల్లి, మదనపల్లి, చౌదరిగూడ, నానాజీపూర్, మల్కారం గ్రామాల్లో అడ్డగోలుగా తవ్వకాలు జరుగుతున్నాయి. మదనపల్లి సర్వే నంబర్ 50లో 500పైగా ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా పది నుంచి 20 అడుగులలోతు తవ్వుతున్నారు. మాడ్గుల మండలం ఆర్కేపల్లి చెరువులోనూ మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. స్థానికంగా ఉన్న కొంత మంది అభ్యంతరం చెప్పడంతో తాత్కాలికంగా తవ్వకాలు నిలిపివేశారు.

టన్నుకు రూ.60పైగా చెల్లించాల్సి ఉన్నా..

జిల్లాలోని మెజార్టీ ప్రాంతాలు నగరానికి ఆనుకుని ఉన్నాయి. బహుళ అంతస్తుల భవనాల్లో పార్కింగ్ కోసం సెల్లార్లు తవ్వుతున్నారు. ఈ తవ్వకాలకు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అనుమతులు ఇస్తోంది. వాటి నుంచి వెలువడిన మట్టి, రాయి, ఇతర ముడిపదార్థాలను మరోచోటికి తరలించాలన్నా.. ఇతరులకు విక్రయించాలన్నా మైనింగ్ శాఖ అనుమతి తప్పనిసరి. టన్ను మట్టికి రూ.60పైగా రాయల్టీ చెల్లించాల్సి ఉంది. ఒకరిద్దరు మినహా చాలా మంది సెల్లార్ కాంట్రాక్టర్లు రాయల్టీ ఫీజు చెల్లించడం లేదు. టిప్పర్ల ద్వారా మట్టిని గుట్టుగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ, పోలీసు విభాగాలు వీరికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు.

'ఈ సిటీ' భూముల్లో..

మహేశ్వరం మండలం రావిర్యాల, చిన్నకంచ, ఎలక్ట్రానిక్ సిటీ కోసం కేటాయించిన సర్వే నంబర్ 289లోని ప్రభుత్వ భూమి, మంకాల్, సర్దార్‌నగర్, కొంగర కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రభుత్వ భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇబ్రహీంపట్నం– మహేశ్వరం నియోజకవర్గాల సరిహద్దులోని ఓ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కీలక అధికారి కనుసన్నల్లోనే ఈ అక్రమ దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇటు ఇటుక బట్టీ వ్యాపారులు, అటు లారీ యజమానుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, అటవీ భూముల్లో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మునగనూరు సర్వే నంబర్ 44లోని ప్రభుత్వ భూమిలో మట్టిని గుట్టలుగా డంప్ చేసి గుట్టుగా నగరానికి తరలిస్తున్నారు.



కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డ్ జడ్జి లక్ష్మణ్, ట్రాఫిక్ సీఐ వెంకటేశం తదితరులు

లోక్ అదాలత్ ప్రారంభం

చేవెళ్ల: ట్రాఫిక్ ఉల్లంఘనలపై నమోదైన పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లు ఎంతో ఉపయోగపడతాయని రిటైర్డు జడ్జి కె.లక్ష్మణ్ అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో సోమవారం చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులపై ఆరు రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రత్యేక లోక్ అదాలత్‌ను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. మొదటిరోజు మొత్తం 129 కేసులను పరిష్కరించడంతోపాటు రూ.3.67 లక్షల జరిమానా విధించినట్లు చెప్పారు. ఇందులో 114 డ్రంకెన్ డ్రైవ్ కేసులు కాగా 15 డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని కేసులు ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ఎలాంటి సమస్యలు ఉండవని పేర్కొన్నారు. తెలిసీ తెలియకుండా చేసే పొరపాట్లను సరిచేసుకునేందుకు న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ తీసుకు వచ్చిందన్నారు. శనివారం వరకు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ పోలీస్ కేసులతోపాటు కొత్తగా నమోదైన కేసులను పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్‌ఐ చందర్‌నాయక్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్తులో మంచి రోజులు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో భేటీ



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు, చిత్రంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి రాకపోవడంతో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురైన మాట వాస్తవమేనని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం మంత్రి మల్‌రెడ్డిని కలిసి చర్చించారు. అనంతరం మీడియా సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సామాజిక సమీకరణాల దృష్ట్యా ఈసారి పదవి రాలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రంగారెడ్డి పేరును పరిశీలించాలని ఏఐసీసీ, పీసీసీని కోరనున్నట్లు తెలిపారు.జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేకపోవడంతో కేడర్‌కు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో సీనియర్ అయిన రంగారెడ్డికి మంచి రోజులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సోలీపూర్ గ్రామస్తులు

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ, గ్రామకంఠం భూములను సర్వేచేసి రక్షణ కల్పించాలని మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ గ్రామస్తులు విన్నవించారు. ఈమేరకు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామశివారులోని సర్వేనంబర్ 101, 102లోని ప్రభుత్వ, గ్రామకంఠం భూములను కొందరు ఆక్రమించి అక్రమంగా షెడ్లను నిర్మించడంతో పాటు ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో మండల సర్వేయర్‌కు ఫిర్యాదు చేస్తే సర్వే చేసి కొన్నిచోట్ల హద్దురాళ్లు పాతకుండా వెళ్లిపోయారని, సర్వే చేసిన రిపోర్టు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. గ్రామశివారులోని మాదిగోనికుంట భూమిని సర్వే చేసి హద్దులు పాతినప్పటికీ కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సింగపాగ జంగయ్య, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

భూ భారతితో శాశ్వత పరిష్కారం

- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి



భూ సమస్యలపై తహసీల్దార్ అయ్యప్పను అడిగి తెలుసుకుంటున్న ముదిరెడ్డి కోదండరెడ్డి

యాచారం: భూ భారతితో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కలుగుతుందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నల్లవెల్లిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయన రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ సర్కార్ ధరణి పోర్టల్ తెచ్చి రైతులను కంటికి కునుకు లేకుండా చేసిందని విమర్శించారు. రైతుల భూ సమస్యలు అలాగే ఉండగా, బీఆర్‌ఎస్ నేతలకు మాత్రం రూ.కోట్లు తెచ్చి పెట్టిందని ఆరోపించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ భూ భారతిని తెచ్చిందని తెలిపారు. రైతుల నుంచి స్వీకరించే దరఖాస్తులను రెవెన్యూ అధికారుల చిత్తశుద్ధితో పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. గ్రామంలోని భూ సమస్యల వివరాలను తహసీల్దార్ అయ్యప్పను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు కమిషన్ కార్యాలయ అధికారి హరి వెంకటప్రసాద్, నల్లవెల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఈదులకంటి లక్ష్మీపతిగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, నాయకులు దెంది రాంరెడ్డి, ఉప్పల భాస్కర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్‌రెడ్డి మంత్రి పదవి అడగడంలో న్యాయం ఉంది

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి అడగడంలో న్యాయం ఉందని ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. యాచారంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో అత్యధికం కలిగిన రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవుల్లో ప్రాతినిధ్యం లేకపోవడం న్యాయమైనది కాదని అభిప్రాయపడ్డారు. అధిష్టానం, సీఎం రేవంత్‌రెడ్డి సరైన సమయంలో న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు.

అలా నిల'బడి'ంది

అదో మారుమూల తండా..సరిపడా విద్యార్థులు రాకపోవడంతో అక్కడి పాఠశాల మూతబడింది. భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. తమకు విద్యాబుద్ధులు చెప్పి ఉన్నతంగా తీర్చిదిద్దిన బడి ఇలా తయారు కావడాన్ని పూర్వ విద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. అంతే తిరిగి తెరిపించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు..

పూర్వ విద్యార్థుల ఐక్యత

- మూతబడిన పాఠశాలకు ప్రాణం
- దాతల సహకారంతో మార్పు
- పునఃప్రారంభానికి సిద్ధం



పాఠశాలకు కొత్తగా పెయింటింగ్, చిత్రాలు, (ఇన్‌సెట్) సర్కారు బడికి పంపాలని ఇంటింటి ప్రచారం

మంచాల: మండలంలోని ఎల్లమ్మ తండాలో గతంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉండేది. విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ రావడంతో నాలుగేళ్ల క్రితం మూసివేశారు. గ్రామంలోని పిల్లలు ఇబ్రహీంపట్నం, ఇతర ప్రాంతాల్లోని పలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. విలువైన భవనాలు, కావాల్సిన తరగతి గదులున్నా విద్యార్థులు లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ క్రమంలో పాఠశాలకు తిరిగి ప్రాణం పొయ్యాలని పూర్వ విదార్థులు నిర్ణయించుకున్నారు. ×మన పాఠశాలను మనమే కాపాడుకుందాం.. మన పిల్లల బంగారు భవితకు బాటలు వేద్దాం¬ అంటూ చేయిచేయి కలిపారు. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా పూర్వ విద్యార్థుల కమిటీ ఏర్పాటు చేశారు.

డిజిటల్ తరగతులు.. ఇంగ్లిష్ మీడియం

అనకున్నదే తడవుగా పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దాతల సహకారంతో ఇంగ్లిష్ మీడియం ఏర్పాటుతో పాటు పూర్తి స్థాయిలో డిజిటల్ తరగతుల నిర్వహణకు కృషి చేస్తున్నారు. పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ విధానం, అన్ని తరగతి గదుల్లో బెంచీలు, టేబుల్స్, విద్యార్థులకు ఉచితంగా నోటు బుక్స్, అవసరమైన కంప్యూటర్లు సిద్ధం చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తరగతి గదులను తీర్చిదిద్దుతున్నారు. పాఠశాల ఆవరణ శుభ్రం చేయడమే గాకుండా కొత్తగా పెయింటింగ్ వేయించారు. విద్యార్థులను ఆకట్టుకునేలా గోడలకు వివిధ రకాల చిత్రాలను గీయించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఐదో తరగతి లోపు పిల్లలు ఇక్కడే చదువుకోవాలని ప్రచారం సాగిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ఎట్టి పరిస్థితుల్లో పంపించొద్దని తీర్మానం చేశారు. గ్రామస్తులు సైతం పాఠశాల అభివృద్ధికి తోచిన విధంగా సహకారం అందిస్తున్నారు. జూన్ 12న ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి పాఠశాలను సిద్ధం చేస్తున్నారు.

కార్పొరేట్ స్థాయిలో..



ఎల్లమ్మ తండా ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వం నిర్వహించే బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతున్నాం. 84 మంది ఐదో తరగతిలోపు విద్యార్థులు ఉన్నట్లు గుర్తించాం. స్థానిక పాఠశాల ఆవశ్యకతను వివరిస్తున్నాం.

– గుండమోని జయమ్మ,మాజీ ఎంపీపీ, మంచాల

నాణ్యమైన విద్యే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరి సహకారం తీసుకుంటున్నాం. పాఠశాలను అన్ని విధాలాతీర్చిదిద్దుతున్నాం. ప్రభుత్వం,దాతల సహకారంతో ముందుకు సాగుతున్నాం.నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం.

– సపావట్ హరికృష్ణ,
పూర్వ విద్యార్థి, ఎల్లమ్మ తండా

ఉపాధ్యాయుల నియామకం



పాఠశాలకు ప్రభుత్వం నుంచి వచ్చే ఉపాధ్యాయులే గాకుండా అదనంగా మరో ఇద్దరిని ఏర్పాటు చేస్తున్నాం. చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రావిణ్యం సాధించే విధంగా శిక్షణ ఇప్పిస్తాం. ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకారం అందించాలి.

– సపావట్ రవి,
పూర్వ విద్యార్థి, ఎల్లమ్మ తండా

మట్టి తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


మాల్‌లో సాగర్‌రోడ్డుపై నిలిచిన మట్టిని జేసీబీతో తొలగిస్తున్న వెంచర్ యజమాని

నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై మాల్‌లో గుట్టపై చేసిన వెంచర్ నుంచి కొట్టుకొచ్చిన మట్టిని సోమవారం వెంచర్ యజమాని తొలగించాడు. 'వర్షం వస్తే బురద.. ఆరితే దుమ్ము' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి రాజు స్పందించారు. వెంచర్ యజమానితో మాట్లాడి వెంటనే మట్టిని తొలగించాలని సూచించారు. లేదంటే కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. దీంతో సాగర్ రోడ్డుపై చేరిన మట్టిని తొలగించారు. – యాచారం

ఏపీలో అక్రమ అరెస్టులు

- పత్రికా స్వేచ్ఛపై దాడిని ఖండించిన ప్రజాస్వామ్యవాదులు
- వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు తగవని హితవు



నవాబుపేట: ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని దళిత రత్న అవార్డు గ్రహీత, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శివరాజ్ మండిపడ్డారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వ్యక్తిగత కక్షసాధింపులకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం వెంటనే తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. పత్రిక స్వేచ్ఛను అడ్డుకోవాలని చూస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల తప్పులను ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కక్ష సాధింపు చర్యే..

ప్రముఖ న్యాయవాది శుభప్రద్‌పటేల్



తాండూరు: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌రావును అరెస్ట్ చేయడం పత్రిక స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది శుభప్రద్‌పటేల్ అన్నారు. ప్రజల్లో నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకతను లోకానికి చూపిస్తున్న వారిపై కక్షగట్టడం తీవ్రమైన చర్య అని పేర్కొన్నారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఏపీ ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. జర్నలిజంలో సుదీర్ఘ అనుభవమున్న వ్యక్తిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఎవరూ హర్షించబోరన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి వ్యవహారాలు కొనసాగుతున్నాయన్నారు. జర్నలిస్టులను అరెస్టు చేయడం, పత్రిక కార్యాలయాలపై దాడులకు దిగడం ఏపీ ప్రభుత్వ నిర్బంధ పాలన పరాకాష్టకు చేరుకుందన్నారు.

అరెస్టు అప్రజాస్వామికం



పరిగి: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు అప్రజాస్వామికమని సీపీఎం నేత, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తీరును ఖండించారు. ఏపీలో ప్రజాస్వామ్య వ్యవస్థలు ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన మోసాలు, అవినీతి, వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే ఇలాంటి చవకబారు కుయుక్తులు పన్నుతోందని ఎద్దేవా చేశారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే..



అనంతగిరి: ఏపీలో కొనసాగుతున్న అక్రమ అరెస్టులపై టీయూడబ్ల్యూజే 143 జిల్లా ఉపాధ్యక్షుడు నర్సయ్య తీవ్రంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని మండిపడ్డారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేయడంలో కూటమి ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేని ఏపీ ప్రభుత్వం, వాటిని ఎత్తి చూపుతున్నారనే కారణంతో అక్రమంగా అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. కేఎస్ఆర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు


రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ ప్రగతికుమారి

చేవెళ్ల: రైతులు తమ పంట పొలాలకు సంబంధించి నేల స్వభావం తెలుసుకునేందుకు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ ప్రగతికుమారి, డాక్టర్ జె.రవీందర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఊరేళ్లలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వ్యవసాయంలో రైతులు సరైన సాగు పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధిస్తారన్నారు. పంటల సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. ఎరువులు, రసాయనిక మందుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. పంట మార్పిడితో దిగుబడులు పెరుగుతాయని సూచించారు. విత్తన ఎంపికలో సరైన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రతిభ, రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

19 మంది నిందితులకు రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: కోడి పందెం రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. మన్నెగూడ ఎంఎంకుంట సమీపంలో మర్రి యాదిరెడ్డి వ్యవసాయ క్షేత్రానికి సమీపంలో కోడి పందేలు కొనసాగుతున్నాయనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. 19 మందిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.19,540 నగదు, 17 సెల్‌ఫోన్లు, 12 కోళ్లు, 12 కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

అదుపుతప్పి డీసీఎం బోల్తా


ఘటనా స్థలంలో డీసీఎం

కేశంపేట: అధిక లోడ్‌తో వెళ్తున్న డీసీఎం.. అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటన మండల పరిధి వేములనర్వ గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్దవెల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన వడ్లను, ఇప్పలపల్లి గ్రామ శివారులోని రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో డీసీఎం మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మహేందర్ రెడ్డికి స్వల్ప గాయాలు అయ్యాయి. మలుపు ప్రమాదకరంగా ఉండటంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య


మాట్లాడుతున్న బాబయ్య

షాద్‌నగర్‌రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య సూచించారు. సోమవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో మండల అధ్యక్షుడు పిట్టల సురేష్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధే ధ్యేయంగా పీఎం మోదీ అనేక సంస్కరణలను తీసుకొస్తున్నారన్నారు. నిరుపేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఎంకనోళ్ల వెంకటేశ్, ఇస్నాతి శ్రీనివాస్, ప్రశాంత్, గణేష్, నర్సింహ, వినోద్‌కుమార్, కుర్మయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


శంకరయ్య (ఫైల్)

చేవెళ్ల: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని మీర్జాగూడ గ్రామానికి చెందిన జేగళ్ల శంకరయ్య(40) భార్య పద్మతో కలిసి శంషాబాద్ సమీపంలో మూడు నెలలుగా తోట కూలీలుగా పని చేస్తూ జీవిస్తున్నారు. ఆదివారం సాయంత్రం స్వగ్రామమైన మీర్జాగూడకు వచ్చారు. రాత్రి ఇంట్లో లైట్లు రావటం లేదని శంకరయ్య మీటర్ వద్ద చెక్ చేసే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి కిందపడిపోయాడు. వెంటనే భార్య స్థానికులతో కలిసి చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహానికి సోమవారం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్‌కు చెందిన మహమ్మద్ రేష్మ, షకీల్‌తో కలిసి ఆదివారం ఆటోలో కొంగరకలాన్‌కు వచ్చారు. అక్కడి నుంచి స్నేహితులు ఎం.లక్ష్మి, సంధ్యారాణి, ప్రతిభలతో కలిసి సంధ్యారాణి.. సోదరి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో కల్లు తాగాలని, మంచిగా ఎక్కడ దొరుకుతుందోనని డ్రైవర్‌ను అడిగారు. ఇదే సమయంలో మరో వ్యక్తి వీరి ఆటో వద్దకు వచ్చి, ముందుకు వెళితే కల్లు దొరుకుతుందని చెప్పాడు. దీంతో రేష్మ బైక్‌పై వచ్చిన వ్యక్తితో కల్లుకోసం వెళ్లింది. కొంత దూరం వెళ్లాక, ఇక్కడి నుంచి నడిచివెళ్లాలని చెప్పి, కొంత దూరం కలిసి వెళ్లారు. ఎవరూ లేరని నిర్ధారించుకున్న సదరు వ్యక్తి, ఆమె చేయి పట్టుకొని, దురుసుగా ప్రవర్తించాడు. బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో అతడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుట్టను తవ్వి.. మట్టిని దోచి


మట్టితవ్వకాలు జరుగుతున్న ప్రదేశంలో టిప్పర్లు

- యథేచ్ఛగా తరలిస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం

బషీరాబాద్: ప్రభుత్వ భూమిలో ఎర్ర మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. యథేచ్ఛగా అక్రమార్కులు తరలిస్తున్నారు. అయినా రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బషీరాబాద్ మండలం నీళ్లపల్లి శివారులోని సర్వే నంబర్ 9లో 3 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఓ గుత్తేదారు రోడ్డు పనుల కోసమని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ యంత్రాలతో మట్టిని తవ్వి, టిప్పర్లలో తరలిస్తున్నాడు. ఆది, సోమవారం ఈ రెండు రోజుల్లో సుమారు 150 టిప్పర్ల మట్టిని తరలించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో భారీ గుంత ఏర్పడింది. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని పేర్కొంటున్నారు. అధికార పార్టీ అండదండలతో గుత్తేదారు మట్టి దోపిడీకి పాల్పడుతున్నాడని తెలిపారు. ఇదే విషయమై తహసీల్దార్ సాహెదాబేగంను వివరణ కోరగా.. మట్టితవ్వకాల విషయం గ్రామస్తుల ద్వారా తెలిసిందని పేర్కొన్నారు. తవ్వకాలు జరిపినట్లు తేలితే సదరు కాంట్రాక్టర్‌పై కేసునమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. పర్మిషన్ లేకుండా మట్టితవ్వకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రయాణికుడి వద్ద రూ.25 లక్షలు పట్టివేత

శంషాబాద్: ఎలాంటి రుజువులు లేకుండా నగదు తరలిస్తున్న ఓ దేశీయ ప్రయాణికుడిని శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నగరానికి చెందిన శశివర్ధన్‌రెడ్డి సోమవారం ఐఎక్స్–2933 విమానంలో గోవా నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు చేపట్టిన తనిఖీల్లో అతడి వద్ద రూ.25 లక్షల నగదు లభ్యమైంది. దానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు కూడా శశివర్ధన్‌రెడ్డి చూపకపోవడంతో డబ్బును నగరంలో ఆదాయపుపన్ను శాఖకు చెందిన ఆయకార్‌భవన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడు అరెస్ట్ చేసి డబ్బులు ఎవరికి ఇవ్వడానికి తరలిస్తున్నాడు..ఇతర లావాదేవీలపై దర్యాప్తు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

వృద్ధ దంపతుల హంతకుడు డ్రైవరే..

పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జన చైతన్య ఫేజ్–2 అపార్ట్‌మెంట్‌లో జరిగిన జంట హత్య కేసులో ప్రధాన నిందితుడు గతంలో పని చేసిన కారు డ్రైవర్‌గా రాజేంద్రనగర్ పోలీసులు నిర్ధారించారు. నిందితున్ని సోమవారం ఉదయం మెదక్‌లో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. హంతకుడు సంవత్సరంన్నర క్రితం వరకు షేక్ అబ్దుల్లా వద్ద కారు డ్రైవర్‌గా పని చేశాడు. ఆ సమయంలో షేక్ అబ్దుల్లాతో పాటు రిజ్వానాలు కఠినంగా ఉండేవారని.. తరచూ దూషించేవారని...దీంతోనే కక్ష పెంచుకున్నట్లు నిందితుడు విచారణలో వెల్లడించాడు. గతంలో మూడుసార్లు హత్యాయత్నం చేసేందుకు వచ్చి వెనుదిరిగాడని.. చివరకు ఈ నెల 6వ తేదీన హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ హత్యకు సహకరించిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడని నిందితుని కోసం పోలీసులు వేటను ముమ్మరం చేశారు.

బంగారం కోసమే బాలమ్మ హత్య

- తెలిసిన మహిళే ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తింపు
- నిందితురాలి అరెస్టు, రిమాండ్

మణికొండ: ఓ వృద్ధురాలి మెడలో, కాళ్లకు ఉన్న బంగారం, వెండిపై కన్నేసిన ఓ మహిళ ఆమెను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకుని వెళ్లి హత్య చేసిన సంఘటనను నార్సింగి పోలీసులు ఛేదించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన రామేశ్వరం బాలమ్మ(75) ఈ నెల 3వ తేదీన ప్రతిరోజు మాదిరిగానే వాకింగ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవటం, ఆమె కోడలు ఓ మహిళపై అనుమానం వ్యక్తం చేస్తూ 4వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా కోడలు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు..ఆమె అనుమానం వ్యక్తం చేసిన మహిళ అనిత కూడా అప్పటి నుంచి కనిపించకుండా పోవడంతో వెదకడం ప్రారంభించారు. 4వ తేదీనే బాలమ్మ మృతదేహం వికారాబాద్ జిల్లా చెన్‌గొముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కనిపించింది. అప్పటికే మృతదేహం గుర్తుపట్టరాకుండా ఉండటం, శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవటంతో వారు స్పాట్‌లోనే పోస్టుమార్టం నిర్వహించి కండ్లపల్లి అడవిలోనే ఖననం చేశారు.

అనిత చిక్కడంతో వెలుగులోకి..

నార్సింగి పోలీసులు విచారణ క్రమంలో అనితను ఈ నెల 7వ తేదీన ఆమె స్వస్థలం వికారాబాద్ జిల్లా పరిగి మండలం, మిట్టకోడూరు గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. ఆమెను తమదైన శైలిలో విచారించటంతో బాలమ్మను తానే బంగారం గురించి హత్య చేశానని, ఆమె వద్ద ఉన్న బంగారం, వెండి తస్కరించినట్లు అంగీకరించింది. మృతదేహం కండ్లపల్లి అడవిలో వదిలేశానని తెలిపింది. దాంతో చెన్‌గొముల్ పోలీసులను సంప్రదించటంతో గుర్తు తెలియని మహిళ శవంగా భావించి పోస్టు మార్టం నిర్వహించి అక్కడే పూడ్చివేశామని తెలిపారు. దాంతో పూడూర్ మండల తహసీల్దార్ అనుమతితో పాతిపెట్టిన బాలమ్మ మృతదేహాన్ని ఈనెల 7వ తేదీన వెలికి తీశారు. ఆమెను బాలమ్మగానే బంధువులు గుర్తించటం, హంతకురాలి వద్ద ఉన్న బంగారం, వెండి స్వాధీనం కావటంతో అనితను అరెస్టు చేశారు.

వృద్ధుడి అదృశ్యం

శంషాబాద్ రూరల్: కుటుంబ కలహాల కారణంగా వృద్ధుడు ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... సంఘీగూడకు చెందిన వట్టెల యాదయ్య(75), మల్లమ్మ దంపతులకు కుటుంబం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మే 31న యాదయ్య తన టీవీఎస్ బైక్ తీసుకుని ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో వాకబు చేసినా ఫలితం లేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రండి.. ప్రభుత్వ కళాశాలలో చేరండి

దౌల్తాబాద్: రండి.. ప్రభుత్వ కళాశాలలో చేరండి అని అధ్యాపకులు కోరుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు అయింది. అయినా గత విద్యాసంవత్సరం దాటిపోవడం, అధ్యాపకుల నియామకం లేకపోవడంతో కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపలేదు. ఇదే విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రస్తుత ఏడాదికి అధ్యాపకులను నియమించారు. విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

మంజూరైన పోస్టులు

కళాశాలలో 12 అధ్యాపక పోస్టులు, ప్రిన్సిపాల్, ఒకటి ఫిజికల్ డైరెక్టర్, ఒక లైబ్రేరియన్ కలిపి మొత్తం 15 పోస్టులు మంజూరు అయ్యాయని అధికారులు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయని, పదో తరగతి పూర్తయిన విద్యార్థులు కళాశాలలో చేరాలని అధ్యాపకులు ప్రచారం చేస్తున్నారు.

సుప్రీంకోర్టు న్యాయవాదిపై హత్యాయత్నం

బంజారాహిల్స్: కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్తున్న సుప్రీంకోర్టు న్యాయవాదిని వెంబడించిన నలుగురు యువకులు ఆయనను అడ్డగించి పిస్టల్ చూపి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..చందూలాల్ బేలాలో నివసించే సీనియర్ సుప్రీంకోర్టు లాయర్ బి.శైలేష్ సక్సేనా ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తన అధికారిక గనమెన్ మహేష్‌ను బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో దింపి తన కారులో భార్య, బావమరిదితో కలిసి రాయదుర్గం వైపు వెళ్తున్నాడు. రోడ్డునెంబర్–12లోని విరించి ఆస్పత్రి వద్ద ముందస్తు పథకం ప్రకార నలుగురు యువకులు బ్లాక్ కలర్ జాగ్వార్ కారులో ఆయన కదలికలను గమనిస్తూ ముందుకువెళ్లారు. నీలోఫర్ కేఫ్ వద్దకు రాగానే పెద్ద పెద్ద హారన్లతో ఇబ్బందికి గురిచేశారు. దీంతో డోర్ తెరిచిన శైలేష్ సక్సేనా ఎందుకు హారన్లు కొడుతున్నారంటూ జాగ్వార్ కారులో ఉన్న నలుగురినీ ప్రశ్నించాడు. ఈ రోజు మీ పని అయిపోతుంది..అంటూ వారు అసభ్య పదజాలంతో దూషిస్తూ హెచ్చరించి శైలేష్ సక్సేనా కారును ఓవర్‌టేక్ చేసి ముందుకువెళ్లారు. కొద్ది దూరంలో కారు ఆపి శైలేష్ సక్సేనాను అడ్డుకునేందుకు యత్నించగా ఆయన వారి నుంచి తప్పించుకుని ముందుకు దూసుకెళ్లారు. ఆగంతకులు మళ్లీ కారును ఓవర్ టేక్ చేస్తూ ఫిలిం ఛాంబర్ వద్ద కారును రోడ్డుకు అడ్డంగా పెట్టి సక్సేనా కారును అడ్డుకున్నారు. కారులో నుంచి బయటకు వచ్చిన నలుగురు యువకులు సక్సేనా కారు అద్దాలను కొడుతూ ఫైర్ ఆర్మ్ పిస్టల్‌తో బెదిరించారు. భయభ్రాంతులకు గురైన సక్సేనా అరగంట పాటు వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అయితే ఆగంతకులు నలుగురూ చుట్టూ రౌండప్ చేసి కారు వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా బెదిరిస్తూ హెచ్చరిస్తూ పిస్టల్ చూపిస్తూ కాల్చేస్తామంటూ సైగలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఎలాగోలా కారు రివర్స్ చేసుకున్న సక్సేనా వారి నుంచి తప్పించుకుని అర్ధరాత్రి 1 గంటలకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. తాను పెద్ద పెద్ద భూవివాదాలు కోర్టుల్లో వాదిస్తుంటానని, తనకు చాలామంది శత్రువులు ఉన్నారని, పలుమార్లు దాడులు కూడా జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ప్రభుత్వం నుంచి గన్‌మెన్ కూడా ఉన్నారన్నారు. ఇటీవలనే రివాల్వర్ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నానని వెల్లడించారు. పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి ఇక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అడ్వకేట్‌ను హత్య చేసేందుకు యత్నించాడా..? బెదిరించి కిడ్నాప్ చేసేందుకు యత్నించారా? అన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

విత్తనాలు నాటేందుకు యంత్రం


యంత్రంతో విత్తనాలు నాటుతున్న రైతు

కొందుర్గు: పత్తి విత్తనాలు నాటడంలో రైతులు వినూత్న పద్ధతి అవలంబిస్తున్నారు. కూలీల కొరతను అధిగమించడానికి యాంత్రీకరణ పద్ధతులను పాటిస్తున్నారు. మండలంలోని చుక్కమెట్టు గ్రామంలో కావలి రాజేందర్ పొలంలో ప్రవర్ధన్ సీడ్స్ కంపెనీ యంత్రం సహాయంతో పత్తి విత్తనాలు నాటే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ యంత్రంతో ఓ వ్యక్తి రోజుకు 5 ఎకరాల వరకు విత్తనాలు నాటవచ్చని పరిశ్రమ రీజినల్ మేనేజర్ రాంబాబు తెలిపారు.

మరుగు దొడ్లు నిర్మించాలి

కొడంగల్: నియోజకవర్గ కేంద్రం కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగు దొడ్లు నిర్మించాలని బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రప్ప సంస్థ అధికారులను కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కర్నాటక సరిహద్దులోని కొడంగల్ బస్టాండ్‌లో చాలీచాలని మరుగుదొడ్లతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం రెండు ఉన్నాయని, ప్రయాణికులకు అనుగుణంగా మరిన్ని నిర్మించాలన్నారు. బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు పాడి ఆవుల మృతి


పాడి ఆవుల కళేబరాలు

చేవెళ్ల: పశువులపాకలో ఉన్న రెండు ఆవులు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని అల్లావాడ అనుబంధ గ్రామమైన జాలగూడలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. జాలగూడ గ్రామానికి చెందిన రైతు అత్తిలి అంజిరెడ్డికి ఎనిమిది పాడి ఆవులు ఉన్నాయి. వీటి పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటీ మాదిరిగానే ఆదివారం కూడా పశువులకు మధ్యాహ్నం మేత వేసి నీళ్లు తాపి పాకలో కట్టేశాడు. రాత్రి పశువులను చూసేందుకు వెళ్లే సరికి రెండు ఆవులు పాకలో చనిపోయి పడి ఉన్నాయి. ఏదైనా విషపురుగు కాటు వేసి ఉంటుందని అనుమానిస్తున్నారు. దాదాపు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని వాపోయాడు.